క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు

పార్వతీపురం టౌన్: విద్యుత్ సరఫరాలో సోమవారం స్వల్పమార్పులు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రామారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని నర్సిపురం, తాళ్లబురిడి గ్రామాల పరిధిలో గల రైతులకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇస్తున్న 3ఫేజ్ కరెంట్ సమయాల్లో మార్పు చేస్తున్నట్లు తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 5గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా అందజేస్తామని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

జోగింపేటలో ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో ఆదివారం ఉదయం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగిందని చీఫ్ సూపరింటెండెంట్ పి.వెంకటి నాయుడు తెలియజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకుగాను ఎస్ఓయి, సీఓయి ప్రవేశ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. స్కూల్ (ఎస్ఓయి) ఆఫ్ ఎక్సలెన్స్‌లో 8వ తరగతి, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు 493 మంది దరఖాస్తు చేసుకోగా 384 మంది హాజరయ్యారని చెప్పారు.

పైప్‌లైన్ల మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సీతానగరం: మండల కేంద్రంలోని కాంప్లెక్స్ నుంచి మార్కెట్ వరకూ వెళ్లే ప్రధాన పైప్‌లైన్ శిథిలావస్థకు చేరుకోవడం వల్ల సోమవారం ప్రజలకు తాగునీరు సరఫరా చేయలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శి జె.వెంకటరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం సమీపంలో సువర్ణముఖి నదిలో నిర్మించిన పంప్ హౌస్ నుంచి గూడెం వీధిలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు నీరు వెళ్లి వీధి కుళాయిలకు సరఫరా చేయాల్సి ఉందన్నారు. అయితే పైపులు శిథిలావస్థకు చేరుకోవడం వల్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉందని ఈ నేపథ్యంలో సోమవారం నీటి సరఫరా నిలిపి వేస్తున్నామని తెలియజేశారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



నాగరాజు పట్నాయక్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని సూరంపేట పంచాయతీ చిన్నారాయుడుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త బి.నాగరాజు పట్నాయక్ (58) ఆదివారం ఉదయం 11.30 గంటలకు గుండెపోటుతో మృతి చెందినట్లు పీఏసీఎస్ చైర్మన్ ఎం.త్రినాథరావు తెలియజేశారు. జగనన్న నాయకత్వంలో పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి సేవలందిస్తున్న నాగరాజు లేకపోవడం పార్టీకి తీరనిలోటన్నారు. ఆయన మృతి పట్ల పార్టీమండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, గుచ్చిమి సర్పంచ్ ఎం శ్రీదేవి, ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావు, స్థానిక నాయకులు బంకురు శంకరరావు, పీఏసీఎస్ చైర్మన్ పి.లక్ష్మునాయుడు, సూరంపేట సర్పంచ్ సీహెచ్ అప్పన్నమ్మ, మాజీ సర్పంచ్ సాంబందొర, మాజీ ఎంపీపీ బి.వరలక్ష్మి, ఎం.స్వామినాయుడు తీవ్ర సంతాపం తెలియజేశారు.

ఇబ్బందులు లేకుండా పింఛన్ల పంపిణీ



పింఛన్ అందుకుంటున్న వృద్ధురాలు

సాలూరు రురల్: పెన్షన్‌ల పంపిణీలో అడ్డంకులు ఎన్ని ఎదురైనా ప్రభుత్వం త్వరితగతిన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి సచివాలయ సిబ్బందితో పెన్షన్ల పంపిణీ సజావుగా నిర్వహించింది. వలంటీర్లు లేకపోవడం వల్ల ఇంటి గుమ్మం ముందు 6గంటలకే అందాల్సిన పెన్షన్‌ను వారం రోజుల పాటు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి వచ్చినప్పటికీ సాలూరు మండలంలో ఇప్పటివరకు 88.54శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేశారు. దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పెన్షన్లు అందించారు. 22 సచివాలయాల పరిధిలో 29 పంచాయతీల్లో గల 593మంది లబ్ధిదారులకు రూ.29లక్షల 61వేలు పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఫణీంద్ర కుమార్ తెలిపారు. మండలానికి చెందిన లబ్ధిదారులు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా పెన్షన్ అందించినట్లు తెలిపారు.

ఎన్నికల ప్రచార శంబరం



గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి రాజన్నదొర, మావుడి సోదరులు



ప్రజలకు అభివాదం చేస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర

- తప్పెటగుళ్లు, కోలాటంతో డిప్యూటీ సీఎం రాజన్నదొరకు ఘనంగా స్వాగతం
- ప్రచారంలో పాల్గొన్న వేలాదిమంది ప్రజలు

మక్కువ: సంబరాల నడుమ మక్కువ మండలంలోని శంబర గ్రామంలో వైఎస్సార్‌సీపీ సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఆదివారం జరిగింది. గ్రామంలోనే మంత్రి రాజన్నదొర విద్యాభ్యాసం జరగడంతో గ్రామస్తులందరికీ ఆయన సుపరిచితులు. గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం రాజన్నదొరకు గ్రామస్తులు తప్పెటగుళ్లు, కోలాటం, మహిళలు డ్యాన్సులతో ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు పూలదండలతో సత్కరించి, హారతులు పట్టారు. గ్రామంలోని ఇంటింటికీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర వెళ్లి, అవ్వా, తాతలు, అక్కా, చెల్లమ్మలను ఆప్యాయంగా పలకరించి, తమ విలువైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. వృద్ధుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మనమంతా గెలిపించుకోవాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించారని, గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని చెప్పారు. లబ్ధిపొందిన వారంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరిచిపోలేరని అన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రజలు సుఖంగా జీవించగలరని స్పష్టం చేశారు. ప్రచార కార్యక్రమంలో జెడ్పీటీసీ, బొబ్బిలి అసెంబ్లీ పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూడి దాలినాయుడు, పెంట సంజీవునాయుడు, అల్లు వెంకటరమణ, తీళ్ల రామినాయుడు, గంజి అప్పలనాయుడు, ప్రసాద్, వసంతుల భాస్కరరావు, గ్రామస్తులతోపాటు, మండలంలోని అన్ని గ్రామాల నుంచి వేలాదిమంది ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మంత్రి రాజన్నదొర నుదుట కుంకుమ దిద్దుతున్న మహిళలు

రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరి

- డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహనరావు



డీఎంఓ డాక్టర్ టి. జగన్ మోహనరావు

పార్వతీపురంటౌన్: రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక డీఎంఓ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండే స్థాయి మనలో ఉండే రోగనిరోధక వ్యవస్థ పనితీరుపై ఆధారపడి ఉంటుందని, అయితే రోగనిరోధకశక్తి మెరుగ్గా ఉండడానికి అవసరమైన జీవనశైలి తప్పనిసరి అని సూచించారు. ఆహారపు అలవాట్లు, వాతావరణం, పరిసరాలు రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం చూపి అనేక రుగ్మతలకు దారితీస్తున్నాయన్నారు. ప్రతిరోజూ తగినంత శ్రమ ఉండాలని, అందుకు తగ్గ సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని చెప్పారు. శరీరంలో నీరు, లవణాల సమతుల్యతకు అవరోధం లేకుండా ఉండాలని అందుకు తగ్గ ఆహార నియమాలు పాటించాలని సూచించారు. శాకాహారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, నూనె కొవ్వు పదార్థాలు కలిగిన ఆహారాన్ని చాలా వరకు తగ్గించుకోవడం ద్వారా హృద్రోగ సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెప్పారు. సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులు మరింత ఆరోగ్యకరమన్నారు. అలాగే మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీటినిల్వలు, మురుగు నీరు, చెత్త లేకుండా చూసుకోవాలని లేకపోతే దోమల ప్రభావం వల్ల పలు అనారోగ్య సమస్యలు సోకుతాయన్నారు. కాలానుగుణంగా ప్రబలే ఆరోగ్య సమస్యలు,ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరికీ అవగాహన ఉండాలని పిలుపునిచ్చారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనంలో బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న అధికారులు

సీతానగరం: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వాహనాల తనిఖీ ముమ్మరం చేస్తున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి కె.చిన్నారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం సీతానగరం మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారిలో లచ్చయ్యపేట, అంటిపేట, సూరంపేట జంక్షన్‌లలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల 13 సాధారణ ఎన్నికలు జరుగుతున్న కారణంగా ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారుల దేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. వాహనాల్లో ఎటువంటి అనుమతులు లేకున్నా నగదు, నిషేధిత సరుకులు తరలించడం నేరమని, వాహన చోదకులు ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వాహనాల తనిఖీ అధికారులకు వాహన యజమానులు సహకరించాలని కోరారు.

ఘనంగా సాయి మందిరం వార్షికోత్సవం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో షిరిడి సాయి మందిరం మూడవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలు షిరిడి సాయి సేవాశ్రమం పార్వతీపురానికి చెందిన సాయి సేవకుడు భోగలింగం ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో భాగంగా ఉదయం బాబా వారికి పాలాభిషేకం, అనంతరం సామూహిక సాయి సత్యవ్రతాలు, చందనోత్సవం, గ్రామంలో సాయిబాబా చిత్రపటం ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ కె.ఆనందరావు

పార్వతీపురం టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం కోసం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను తహసీల్దార్ కె.ఆనందరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రతకు గదులు, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన చర్యల గురించి సిబ్బందిని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కావలసిన ఏర్పాట్లు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లలో సీసీకెమెరాల ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి పార్టీకి తీరనిలోటు



సన్యాసినాయుడు మృతదేహంపై పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మండలంలోని కృష్ణారాయపురం మాజీ వీఆర్వో, మాజీ సర్పంచ్ రెడ్డి సన్యాసినాయుడు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పట్టణంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం ఎన్నికల ప్రచారం చేస్తుండగా కృష్ణారాయపురం మాజీ సర్పంచ్ రెడ్డి సన్యాసినాయుడు మృతి చెందిన సమాచాం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు గ్రామానికి చేరకుని మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెడ్డి సన్యాసినాయుడు పార్టీ ఎనలేని సేవలందిస్తున్నారని కొనియాడారు. మృతుడు సన్యాసినాయుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీ మాజీ చైర్మన్ వి.నాగేశ్వరరావు, సీడీసీ మాజీ చైర్మన్‌లు రెడ్డి అన్నంనాయుడు, ఎస్ రామకృష్ణ, స్థానిక సర్పంచ్ జి.అన్నంనాయుడు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పి.బలరాంనాయుడు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్వతీపురం ఇంజినీరింగ్ సహాయకులు అధికారులు వివిధహోదాల్లో పార్టీకి సేవలందిస్తున్న కార్యకర్తలు ఉన్నారు.

ప్రజామద్దతుతో మళ్లీ గెలుపు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- సంగంవలస, పార్వతీపురంలో ఎన్నికల ప్రచారం



పార్వతీపురం పట్టణంలోని 3వ వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రజా మద్దతుతో మళ్లీ గెలిచి నిలిచేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురం మండలంలోని సంగంవలస పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారాన్ని గడపగడపకు వెళ్లి చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99% నెరవేర్చడమే కాకుండా హామీ ఇవ్వని అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను చేపట్టి రాష్ట్ర ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచారన్నారు. విద్య, వైద్య వ్యవస్థల్లో సమూలంగా ప్రక్షాళన చేసి వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి నేడు దేశంలోనే గర్వించదగినట్లుగా రాష్ట్రంలో విద్య, వైద్య వ్యవస్థలను మెరుగుపరిచారని చెప్పారు. మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని గుర్తు చేశారు. ఈ ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితాలే మళ్లీ ఆయన్ను 2024 ఎన్నికల్లో గెలిపించి తీరుతాయని స్పష్టం చేశారు. గడపగడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుని మన ప్రాంతాన్ని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా చూడాలని కోరారు. అందుకు మీ అందరి దీవెనలు, మద్దతును అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతి గడప వద్ద ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలుకుతూ తమకు ఎంతగానో మేలు చేసిన ఈ ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని తెలుపుతూ మా అందరి పూర్తి సహాయ సహకారాలు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికేనని, మళ్లీ తమ కుటుంబాలన్నీ కూడా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా జోగారావును, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ని గెలిపించు కుంటామని చెబుతూ ప్రజలందరూ ఆశీర్వదించారు.

పట్టణాన్ని అభివృద్ధి చేశాం

ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పార్వతీపురం పట్టణాన్ని అభివృద్ధి చేశామని గర్వంగా చెబుతున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 3వ వార్డులో ప్రజలను కలుసుకుని మద్దతు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలాలు అందుకున్న పేదలంతా సంతోషంగా ఉన్నారన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, స్థానిక వార్డు కౌన్సిలర్ సువ్వాడ లావణ్య, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్ సభ రణభేరి చిన్నంనాయుడు, నిమ్మకాయల సుధీర్‌కుమార్, ఎడ్ల త్రినాథ, బొత్స ఆనంద్, జె దివ్య, పి జయంతి, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ శ్రీరంజన్, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ వి.గురురాజు జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, నాయకులు మజ్జి శేఖర్, బలగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ బడే రామారావు, గృహ సారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సంగంవలసలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

వైఎస్సార్‌సీపీ పేదల ప్రభుత్వం

బలిజిపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేట మండలంలోని నారాయణపురంలో ఆదివారం ఆయన ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి నిరుపేద కుటుంబానికి మేలు జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసి వారి కుటుంబాలకు అండగా నిలిచిన ప్రభుత్వమిదని చెప్పారు. ప్రతి పక్షాలు ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నాయని వాటిని నమ్మవద్దని కోరారు. చదువుకున్నవారికి సచివాలయ ఉద్యోగాలను ఒక్క పైసా ఖర్చులేకుండా, రికమండేషన్లు, లంచాలకు తావులేకుండా ఈ ప్రభుత్వం ఇవ్వలేదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో వదిలివేసిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని గుర్తు చేశారు. స్వయం ఉపాధి కల్పన చేసిందని, రానున్న రోజుల్లో పరిశ్రమల్లో యువతకు మంచి ప్రాధాన్యం ఉంటుందన్నా రు. అవ్వాతాతలను, యువతను, మహిళలను నేరుగా కలిసి వారికి సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, యువతకు ఉపాధి మార్గాలపై ప్రభుత్వం చేసిన వాటిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎం.శ్రీనివాసరావు, డి.అప్పలనాయుడు, మజ్జి శ్రీరామూర్తి, సన్నిబాబు, ఎం.ప్రసాద్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు దుర్గేశ్వరి, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జేఏసీ కన్వీనర్ శ్రీరాములునాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు కె.మోహనరావు, ఎస్.పాపారావు, ఎ.సుందరరావు, విజయ, ఆర్.శ్రీనివాసరావు, బి.బాలసన్యాసినాయుడు, ఎంపీటీసీ ఎం.సాంబమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.



బలిజిపేట: నారాయణపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

చిరు వ్యాపారానికి 'జగనన్న తోడు'

- పచ్చళ్ల తయారీలో మహిళలు

సాలూరు రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజలకు సంక్షేమం అందించడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు. ఈ నేపథ్యంలో సాలూరు మండలంలోని అన్నం రాజువలస పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి దగ్గరలో వ్యవసాయ భూముల మధ్య నివాసముంటున్న ముగ్గురు మహిళలు కలిసి జ్యోతి మహిళా పొదుపు సంఘం ద్వారా అందించిన జగనన్న తోడు పథకంలో అందిన ఆర్థిక సాయంతో పచ్చళ్ల వ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా నాలుగు డబ్బులు వెనకేసుకుంటున్నారు. గంటా రత్నకుమారి, అరసపల్లి కుమారి, గంటా సుజాతలు జ్యోతి మహిళా సంఘంలో సభ్యులుగా ఉంటున్నారు. అయితే జగనన్న తోడు పథకంలో అందిన రూ.60వేలతో పచ్చళ్ల వ్యాపారం చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. వారు చికెన్ పచ్చడి, గోంగూర, టామోటా, మామిడి కాయ పచ్చళ్ల వ్యాపారం చేస్తున్నారు. తాము తయారు చేసిన పచ్చళ్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు బెంగళూరు, ఢిల్లీ, లండన్‌లో ఉంటున్న భారతీయులకు కూడా పంపిస్తామని జ్యోతి మహిళా పొదుపు సంఘం సభ్యురాలు అరసపల్లి కుమారి తెలిపారు. చికెన్ పచ్చడి 1 కేజీ రూ.800, ఆవకాయ, గోంగూర, టమాటో పచ్చళ్లు కేజీ రూ.300కి అమ్ముతున్నట్లు చెప్పారు. నెలనెలా ఈ పచ్చళ్ల వ్యాపారంతో రూ.10వేలకు పైగా సంపాదిస్తున్నామని జగనన్న మాలాంటి చిరు వ్యాపారులను ఆదుకోవడం ఆనందంగా ఉందని వారు చెబుతున్నారు.



పచ్చళ్లు తయారు చేస్తున్న మహిళలు



వ్యాపార బ్యానర్